ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
బుధవారం 25 డిసెంబరు 2024



18లోగా డిగ్రీ స్పెషల్ డ్రైవ్ పరీక్ష ఫీజు చెల్లించాలి

ఎచ్చెర్ల, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాలల్లో సెమిస్టర్ విధానంలో చదివి ఫెయిలైన విద్యార్థులు వచ్చే నెల 18వ తేదీలోగా ఫీజు చెల్లించాలని డీన్ డాక్టర్ జి.పద్మారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1,3,5 సెమిస్టర్ల సప్లిమెంటరీ కోసం ఈ ఫీజు చెల్లించాలన్నారు. అలాగే డిగ్రీ ఐదో సెమిస్టర్ ఫలితాలను విడుదల చేశామని తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ కోర్సులకు 6,529 మంది విద్యార్థులు హాజరుకాగా, 3,560 మంది ఉత్తీర్ణులయ్యారని చెప్పారు.



మాట్లాడుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

కేంద్రం నుంచి నిధులు తెస్తా

- జిల్లా అభివృద్ధి బాధ్యత అధికారులదే
- వైసీపీ పాలనలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం: కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

అరసవల్లి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): 'జిల్లా సమగ్రాభివృద్ధికి అధికారులు ప్రణాళికలు రూపొందించాలి. ఎన్డీయేలో కేంద్రమంత్రిగా ఉన్న నేను ఆయా ప్రభుత్వ శాఖలతో మాట్లాడి, ప్రత్యేకంగా నిధుల కేటాయించేలా చూస్తా' అని జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) చైర్మన్, కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన 'దిశ' సమీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. జలజీవన్ మిషన్, పీఎం ఆవాస్ యోజన, టిడ్కో ఇళ్లు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, తదితర శాఖలపై అంశాల వారీగా సమీక్షించి అధికారులకు (మిగతా 6వ పేజీలో..)

రూ.వెయ్యి కోట్లు వెనక్కి

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సరైన ముందస్తు ప్రణాళిక లేకపోవడంతో ఐదేళ్లలో మొత్తం రూ.1000కోట్ల నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. గత ఏడాది ఉపాధిహామీ పథకానికి సంబంధించి జిల్లాలో రూ.230కోట్ల నిధులు వెనక్కు వెళ్లిపోయాయి. నిధుల ఉన్నా పనులు చేసుకోలేని పరిస్థితి వైసీపీ ప్రభుత్వంలో ఏర్పడింది. ఇది క్షమార్హం కాదు.

- లంక దినకర్, 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్

నిధుల దుర్వినియోగం

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉద్దానం మంచినీటి పథకంలో పెద్ద ఎత్తున నిధులు దుర్వినియోగమయ్యాయి. పాత పథకానికి చెందిన ట్యాంకులను మళ్లీ వినియోగిస్తూ, ఇప్పుడు తాగేందుకు నీరు లేకుండా చేశారు. ఈ పథకంలో గతంలో పనిచేసిన వారిని తొలగించి అన్యాయం చేశారు. దీనిపై కలెక్టర్ ఒకరోజు ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించాలి.

- బెందాళం అశోక్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే, ఇచ్ఛాపురం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూన రవికుమార్, ప్రజాప్రతినిధులు, అధికారులు



శ్రీకాకుళం: పాత్రునివలసలో నిర్మించిన టిడ్కో ఇళ్లు..

- టిడ్కో ఇళ్లపై వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం
- గత ఐదేళ్లూ పట్టించుకోని వైనం
- ఏళ్ల తరబడి లబ్ధిదారుల నిరీక్షణ
- కూటమి ప్రభుత్వమైనా న్యాయం చేయాలని వేడుకోలు

ఇళ్లూ లేవు.. డీడీలూ లేవు

శ్రీకాకుళం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి):

పట్టణ ప్రజలకు సొంతిళ్లు కల్పించాలనే లక్ష్యంతో టీడీపీ ప్రభుత్వ హయాంలో (2014-2019 మధ్య) టిడ్కో(ఆంధ్రప్రదేశ్ టౌన్‌షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ద్వారా ఇళ్ల నిర్మాణం చేపట్టారు. లబ్ధిదారుల ఆసక్తిని బట్టి వివిధ చదరపు అడుగుల విస్తీర్ణంతో ఇళ్లను నిర్మించి ఇచ్చేందుకు కొంత మొత్తాన్ని డీడీల రూపంలో తీసుకున్నారు. ఇళ్ల నిర్మాణం దాదాపు పూర్తికాగా.. ఇంతలో 2019లో సార్వత్రిక ఎన్నికలు సమీపించాయి. దీంతో లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించే ప్రక్రియను అప్పటి టీడీపీ ప్రభుత్వం వాయిదా వేసింది. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్లపై పూర్తి నిర్లక్ష్యం చూపింది. లబ్ధిదారులకు ఇళ్లు అప్పగించకపోగా.. అంతకుముందు కొంతమంది చెల్లించిన డీడీలు సైతం వెనక్కి ఇవ్వలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో లబ్ధిదారుల ఆశలు చిగురిస్తున్నాయి. ప్రభుత్వం స్పందించి తమకు ఇళ్లు కేటాయించాలని, లేదంటే అప్పట్లో చెల్లించిన డీడీల సొమ్ము అయినా వెనక్కి ఇవ్వాలని కోరుతున్నారు.

● జిల్లాలో ఇదీ పరిస్థితి..

శ్రీకాకుళం నగరంతోపాటు ఆమదాలవలస, పలాస-కాశీబుగ్గ, ఇచ్ఛాపురం మునిసిపాలిటీల్లో 2014-2019 మధ్య కాలంలో టిడ్కో ఆధ్వర్యంలో ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 430 ఎస్ఎఫ్‌టీ విస్తీర్ణం గల ఇంటి కోసం రూ.1లక్ష, 365 ఎస్ఎఫ్‌టీ విస్తీర్ణం ఇంటికోసం రూ.50వేలు, 300 ఎస్ఎఫ్‌టీ ఇంటి కోసం రూ.25వేలు చొప్పున లబ్ధిదారుల నుంచి డీడీల రూపంలో తీసుకున్నారు. శ్రీకాకుళం నగర ప్రజలకోసం పాత్రునివలస వద్ద జీ+4 రీతిలో ఇళ్లను నిర్మించారు. ఫేజ్-1, ఫేజ్-2 కలిపి 1904 ఇళ్లను నిర్మించేందుకు శ్రీకారం చుట్టారు. ఇందులో 1280 ఇళ్లను పూర్తిచేసి లబ్ధిదారులకు అప్పగించారు. అయితే ప్రస్తుతం 460మంది మాత్రమే టిడ్కో ఇళ్లల్లో నివాసముంటున్నారు. మిగిలినవారు అక్కడ నివాసముండేందుకు విముఖత చూపించడంలేదు. అలాగే ఇంకా 624 ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. ఆమదాలవలసలో 528 ఇళ్ల నిర్మాణం చేపట్టారు. దాదాపు 80శాతం పూర్తిచేసి వదిలేశారు. పలాస-కాశీబుగ్గలో 912 ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. ఇచ్ఛాపురంలో 192 ఇళ్ల నిర్మాణం దాదాపు 90 శాతం పూర్తయి నిలిచిపోయింది.

● వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో..

టిడ్కో ఇళ్లను పూర్తిచేసి.. లబ్ధిదారులకు అప్పగించే విషయంలోనూ వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ఇళ్లను అప్పగిస్తే చంద్రబాబునాయుడికే పేరు వస్తుందన్న కారణంతో అప్పట్లో జగన్మోహనరెడ్డి.. టిడ్కో ఇళ్లపై నిర్లక్ష్యంగానే వ్యవహరించారన్నది బహిరంగ రహస్యమే. ఇదిలా ఉండగా.. గత ఐదేళ్లు లబ్ధిదారులకు ఇళ్లు ఇవ్వకపోయినా.. కనీసం పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణ పనులను పూర్తి చేయించలేకపోయారు. ఇటీవల ఆ భవనాల కాంక్రీటు ఎలా ఉంది.. నివాసానికి ఆమోదయోగ్యమా? కాదా ? అన్నది ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షించారు. భవనాలు నూరు శాతం స్టాండర్డ్‌గా ఉన్నా.. ఇతర సదుపాయాల కోసం చేపట్టినవి పాడయ్యాయని తేలింది. ఎలక్ట్రికల్ వైరింగ్, ఉడ్ వర్క్(చెక్కతో తయారీచేసిన ద్వారబంధం, కిటికీ ఫ్రేమ్, తలుపులు వంటివి) పాడయ్యాయి. వాటిని తీసి మళ్లీ కొత్తవి అమర్చాల్సి ఉంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో కొంతమంది ఇళ్ల కోసం, మరికొంతమంది తాము చెల్లించిన డీడీల నగదు వెనక్కి వచ్చేస్తాయని ఆశగా ఎదురుచూస్తున్నారు. అప్పట్లో ఇళ్లు మంజూరుకాని వారికి డీడీలను వెనక్కి ఇస్తామని అధికారులు ప్రకటించారు. కానీ, కార్యరూపం దాల్చలేదని పలువురు వాపోతున్నారు.

● చెల్లించాల్సింది రూ.20 కోట్లు పైబడి..

టిడ్కో ఇళ్ల కోసం అప్పట్లో అధికమంది అర్హులు డీడీలను చెల్లించారు. ఇళ్ల మంజూరు జరిగినా, నిర్మాణం చివరాఖరున వేగవంతం కాలేదు. పూర్తి చేసిన ఇళ్లను అప్పగించలేదు. పాత్రునివలస వద్ద ఇళ్లను అప్పగించినా సగం మంది లబ్ధిదారులు కూడా అక్కడకు వెళ్లలేదు. అయితే డీడీలు చెల్లించినవారికి అధికమందికి ఇళ్లు మంజూరు చేయలేకపోయారు. ప్రభుత్వం మారడంతో డీడీలను వెనక్కు ఇవ్వలేదు. ప్రస్తుతం ఆ డబ్బులను వెనక్కి ఇవ్వాలని.. మునిసిపాల్టీల నుంచి కలెక్టర్‌కు.. కలెక్టర్ నుంచి ప్రభుత్వానికి లేఖ వెళ్లింది. శ్రీకాకుళం నగరపాలక సంస్థలో టిడ్కో ఇళ్ల కోసం డబ్బులు చెల్లించి.. ఇళ్లు మంజూరుకాని వారు అత్యధికంగా ఉన్నారు. వారికి వెనక్కి ఇవ్వాల్సిన మొత్తమే రూ.12కోట్లు. అలాగే పలాస-కాశీబుగ్గలో రూ.5కోట్లు, ఆమదాలవలసలో రూ.3కోట్లు, ఇచ్ఛాపురంలో రూ.1కోటి చెల్లించాల్సి ఉంది. అప్పట్లో అప్పు చేసి.. డీడీలు చెల్లించామని లబ్ధిదారులు వాపోతున్నారు. అప్పులకు వడ్డీ చెల్లించలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని పేర్కొంటున్నారు. ఇళ్లు ఇవ్వకపోయినా.. అప్పట్లో ఇచ్చిన డీడీల సొమ్ము వెనక్కి ఇవ్వాలని కోరుతున్నారు. దీనిపై కలెక్టర్, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సంతోషం.. అంతలోనే విషాదం

- దైవ దర్శనానికి వెళ్తూ.. ప్రమాదం
- విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు
- ముగ్గురి మృతి.. మరో ముగ్గురికి గాయాలు
- డ్రైవర్ నిద్రమత్తే కారణం
- బాధితులంతా విశాఖపట్నం, భద్రాచలం వాసులే
- చిన్నకొజ్జిరియా కూడలి వద్ద ఘటన



సోమవారం రాత్రి బీచ్‌లో కుటుంబ సభ్యులతో కలిసి కేక్ కట్ చేసి.. సంబరాలు చేసుకుంటున్న నేహాగుప్తా



నేహా గుప్తా (ఫైల్)



చిన్న కొజ్జిరియా కూడలి వద్ద బోల్తా పడిన కారు

కంచిలి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి):

తమ ఒక్కగానొక్క కుమార్తెకు పాట్నా ఐఐటీలో సీటు వచ్చింది. ఆ ఆనందంతో కుటుంబ సభ్యులంతా సోమవారం రాత్రి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఆ తర్వాత కొన్ని గంటల్లోనే ఆ ఇంట విషాదం అలుముకుంది. దైవదర్శనం కోసం మంగళవారం ఉదయం కారులో ఒడిశాకు వారంతా బయలుదేరారు. మార్గమధ్యలో వారి కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందగా, మరో ముగ్గురు గాయపడ్డారు. క్షతగాత్రుల్లో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. కంచిలి మండలం చిన్న కొజ్జిరియా కూడలి వద్ద ఈ ప్రమాదం చోటు చేసుకుంది. కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విశాఖపట్నం జిల్లా సీతమ్మధారకు చెందిన ముత్తా వెంకట రంగ రాజేష్ గుప్తా కుమార్తె నేహా గుప్తా(18)కు పాట్నా ఐఐటీలో సీటు వచ్చింది. దీంతో రాజేష్‌తో పాటు భార్య లావణ్య(43), కుమార్తె నేహాగుప్తా, తల్లి సుబ్బలక్ష్మి, తెలంగాణ రాష్ట్రం భద్రాచలానికి చెందిన తోడల్లుడు కదిరిశెట్టి సోమేశ్వరరావు(49), మరదలు రాధిక సోమవారం రాత్రి బీచ్‌లో కేక్ కట్ చేసి.. సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఇంటికి చేరుకున్నారు. వీరంతా మొక్కు తీర్చుకునేందుకు ఒడిశా రాష్ట్రం జాజ్‌పూర్‌లోని తరిణి మాత దేవాలయానికి మంగళవారం వేకువజామున 5 గంటల సమయంలో విశాఖపట్నం నుంచి కారులో బయలుదేరారు. ఉదయం 9 గంటల సమయంలో కంచిలి మండలం చిన్న కొజ్జిరియా సమీపంలోకి వచ్చే సరికి డ్రైవింగ్ చేస్తున్న రాజేష్ కాస్త నిద్ర మత్తుకి గురయ్యాడు. దీంతో ఒక్కసారిగా కారు అదుపుతప్పి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీ కొని బోల్తా పడింది. కారు నుజ్జునుజ్జయింది. కారులో ఉన్న (మిగతా 6వ పేజీలో...)



రోదిస్తున్న బాధిత కుటుంబ సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ సీహెచ్ వివేకానంద.. పోలీసుల అదుపులో నిందితులు (వెనుక భాగాన)

పథకం ప్రకారమే..

- వ్యాపారి ఇంట్లో చోరీకి యత్నం
- కేసు ఛేదించిన పోలీసులు
- నలుగురి అరెస్టు.. ఇద్దరి పాత్రపై విచారణ
- శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద

శ్రీకాకుళంక్రైం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరంలో ఇటీవల ఓ వ్యాపారి ఇంట్లోకి ముగ్గురు వ్యక్తులు చొరబడి, కత్తులతో బెదిరించి దొంగతనానికి యత్నించడంపై నమోదైన కేసును పోలీసులు ఛేదించారు. నేరానికి పాల్పడిన ముగ్గురితో పాటు దీనివెనుక ఉన్న సూత్రధారిని కూడా అరెస్టు చేశారు. పథకం ప్రకారమే వారు ఈ నేరానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఈ వివరాలను మంగళవారం శ్రీకాకుళం సబ్‌డివిజనల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ సీహెచ్ వివేకానంద వెల్లడించారు. శ్రీకాకుళం గూనపాలెంలో ఇంటి వద్దనే కిరాణా షాపు నిర్వహిస్తున్న (మిగతా 6వ పేజీలో..)

దళిత మహిళలకు 'ఉన్నతి'

- రూ.3 లక్షల వరకూ జీరో వడ్డీకే రుణం
- ఇందులో రూ.50వేల వరకూ సబ్సిడీ
- స్వయం ఉపాధికి వీలు

6 లో

రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి

పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి: ఎస్పీ మహేశ్వరరెడ్డి

7 లో

క్రిస్మస్ సందడి



శ్రీకాకుళం కల్చరల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ వేడుకలకు ప్రార్థనాలయాలు సిద్ధమయ్యాయి. చర్చిలను విద్యుద్దీపాలంకరణతో సుందరంగా తీర్చిదిద్దారు. మంగళవారం అర్ధరాత్రి నుంచి ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. అంతటా బాల ఏసు ప్రతిమలు ఆకట్టుకున్నాయి. శాంతాక్లాజ్ వేషధారణలో చిన్నారులు.. పెద్దలు సందడి చేశారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో బుధవారం క్రిస్మస్ సంబరాల నిర్వహణకు సన్నాహాలు పూర్తిచేశారు. శ్రీకాకుళంలోని టౌన్‌హాల్, సహాయమాత చర్చిల్లో మంగళవారం రాత్రి ప్రార్థనలు చేశారు. వర్షిప్ చర్చిలో ఏసు పుట్టుక ప్రవచనాలు, క్యాండిల్ సర్వీస్ నిర్వహించారు.




శ్రీకాకుళంలోని చర్చిలో ప్రార్థనలు..

సందడిగా క్రిస్మస్

- చర్చిలకు విద్యుద్దీపాలంకరణలు
- మందిరాల్లో శాంతి ప్రవచనాలు, కేక్ కటింగ్‌లు
- వివిధ వేషధారణలతో ఆకట్టుకున్న చిన్నారులు

టెక్కలి, పొందూరు, పాతపట్నం, పలాస రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా మంగళవారం పలు చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. క్రిస్మస్‌ను పురస్కరించుకుని చర్చిలను రంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. ప్రార్థనా మందిరంలో యేసు క్రీస్తు శాంతి సందేశాన్ని పాస్టర్లు అందించారు. కేక్ కటింగ్ చేశారు. ఈసందర్భంగా విద్యార్థులు క్రిస్మస్ తాత వేషధారణలు, గీతాలు, నృత్య ప్రదర్శనలతో అలరించారు.


పలాసరూరల్: పాత్రియోలో సీయోన్‌గ్రేస్ చర్చి విద్యుద్దీపాలంకరణ..


టెక్కలి: లివింగ్‌స్టోన్ చర్చిలో చిన్నారుల నృత్య ప్రదర్శన


పాతపట్నంలో ఆర్‌సీఎం చర్చి


పిల్లలకు క్రిస్మస్ కేక్ తినిపిస్తున్న కలెక్టర్


పొందూరు: క్రిస్మస్ వేడుకల్లో..


ఇచ్ఛాపురంలో..

అన్నివేళలా అండగా ఉంటా

- క్రిస్మస్ వేడుకల్లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్

అరసవల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవ సోదరులకు అన్నివేళలా అండగా ఉంటానని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ భరోసా ఇచ్చారు. క్రిస్మస్ వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈమేరకు మంగళవారం నగరంలోని కరుణ సమాజంలో రెడ్‌క్రాస్, అప్‌హోల్డ్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు జరిగాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం 35 మంది కుష్ఠు వ్యాధిగ్రస్తుల కుటుంబాలకు కందిపప్పు, గోధుమపిండి, నూనె, పంచదార, బియ్యం, చీరలు, తువ్వాళ్లు, దుప్పట్లు, దోమ తెరలను కలెక్టర్ పంపిణీ చేసారు. అప్‌హోల్డ్ సంస్థ తరఫున రూ.1,50,000ల చెక్కును అక్కడి విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఛైర్మన్ జగన్మోహనరావు, డీపీఆర్‌వో బాలమాన్‌సింగ్, అప్‌హోల్డ్ ప్రాజెక్టు మేనేజర్ క్రిస్టోఫర్, రెడ్‌క్రాస్ సభ్యులు కళ్యాణచక్రవర్తి, చిన్మయిరావు, రమణ, చైతన్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

దళిత మహిళలకు ఉన్నతి

- రూ.3 లక్షల వరకూ జీరో వడ్డీకే రుణం
- ఇందులో రూ.50 వేల వరకూ సబ్సిడీ
- నాలుగు విభాగాల్లో స్వయం ఉపాధికి వీలు

సంతబొమ్మాళి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి)

ఎస్సీ పొదుపు సంఘాల మహిళలకు ఇంటి వద్దే స్వయం ఉపాధి కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందు కోసం ఉన్నతి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకంలో భాగంగా ఎస్సీ మహిళలకు వ్యక్తిగతంగా యూనిట్లు స్థాపించేందుకు రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు రుణం జీరో వడ్డీకే ఇవ్వనున్నారు. దీనిని పీఎం అజయ్ పథకానికి అనుసంధానం చేస్తున్నారు. దీంతో వ్యక్తిగత రుణం తీసుకున్న స్వయం సహాయక మహిళలకు తీసుకున్న రుణంలో రూ.50 వేల వరకు సబ్సిడీ ఉంటుంది. మిగిలిన రుణం వడ్డీ లేకుండా చెల్లించాలి.


స్వయం శక్తిసహాయ సంఘు సమావేశం

ఇవీ అర్హతలు..

వయసు 60 ఏళ్ల లోపు ఉండాలి. పేదలు, నిరుపేదల సర్వేలో నమోదై ఉండాలి. స్వయం సహాయక సంఘాల్లో సభ్యురాలిగా రుణం ఇచ్చేందుకు గ్రూపు సభ్యుల తీర్మానం చేయాలి. స్త్రీనిధి బకాయి ఉండకూడ దు. గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రాయితీ పొందిన వారికి ఈ పథకం వర్తించదు. ఒంటరి మహిళలు, దివ్యాంగులు, సొంతిల్లు, భూములు లేని నిరుపేదలకు ప్రాధాన్యమిస్తారు.

నాలుగు రంగాల్లో యూనిట్లు...

వ్యవసాయ రంగంలో భాగంగా నర్సరీల్లో మొక్కలు పెంపకం, పుట్టగొడుగులు, కూరగాయల సాగు, పచ్చిమిరప, చింతపండు, వేప పిండి విక్రయాలు, కోళ్లపెంపకం, వర్మీ కంపోస్టు తయారీ కేంద్రాలు ఏర్పాటు చేసుకోవచ్చు. ● సేవా రంగంలో భాగంగా ఆటోరిక్షా, ఫొటో స్టుడియో, ట్రావెల్ ఏజెన్సీ, కంప్యూటర్ నెట్ సెంటర్, జిరాక్స్ సెంటర్, బ్యూటీ పార్లర్, బ్యాండ్, ఆర్కెస్ట్రా, టైలరింగ్ తదితర వాటికి రుణ సౌకర్యం పొందే వీలుంది. ● సూక్ష్మ వ్యాపారాల్లో భాగంగా కిరాణా దుకాణం, పూల వ్యాపారం, చెప్పుల దుకాణం, ఫ్యాన్సీ స్టోర్స్ చీరలు, గాజులు, అల్పాహార కేంద్రాలు, బియ్యం, పప్పుదినుసులు, చిరుధాన్యాల విక్రయాలు, మొబైల్ క్యాంటీన్లు ఏర్పాటు చేసుకోవచ్చు. ● చిన్నతరహా పరిశ్రమల విభాగంలో కంప్యూటర్ ఎంబ్రాయిడరీ, పేపర్ ప్లేట్స్ తయారీ, కొబ్బరి పీచు, వాటర్ ప్లాంట్, పిండి మిల్లు, పచ్చళ్లు, అప్పడాలు చెక్కీలు, బిస్కట్స్ తయారీ, వడ్రంగి, గార్మెంట్ పరిశ్రమ ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఉంది.

స్వయం ఉపాధికి తోడ్పాటు..



ఎస్సీ స్వయంశక్తి మహిళల స్వయం ఉపాధికి ఉన్నతి పథకం చేదోడుగా ఉంటుంది. ఈ పథకంలో రుణం పొందిన మహిళలు ఆర్థిక పరిపుష్టి సాధించ వచ్చు. దీనిపై విస్తృతంగా అవగాహన కల్పిస్తాం.

-టి.సూర్యనారాయణ, ఏపీఎం, సంతబొమ్మాళి

సంతోషం.. అంతలోనే విషాదం

(ఐదో పేజీ తరువాయి)

వారందరూ కుదుపులకు గురై, తలలకు బలమైన గాయాలయ్యాయి. వీరంతా కారులో ఇరుక్కుపోయారు. స్థానికులు వెంటనే అక్కడకు చేరుకుని వారిని బయటకు తీశారు. ఘటనా స్థలంలోనే లావణ్య మృతి చెందింది. ఆమె కపాలం భాగం తెగి.. రోడ్డుపై పడింది. మిగిలిన క్షతగాత్రులను 108 వాహనం, హైవే అంబులెన్స్‌లో సోంపేట ప్రభుత్వాసుపత్రికి స్థానికులు తరలించారు. మార్గమధ్యలో నేహా గుప్తా, సోమేశ్వరరావు మృతి చెందారు. రాధిక పరిస్థితి విషమంగా ఉండటంతో ఆమెను వెంటనే శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. రాజేష్ గుప్తా, తల్లి సుబ్బలక్ష్మికి స్వల్ప గాయాలయ్యాయి.

అయ్యో.. దేవుడా?

కుటుంబ సభ్యుల మృతదేహాలను చూస్తూ రాజేష్ రోదిస్తున్న తీరు అందరినీ కలచివేసింది. దేవుడి దర్శనానికి వెళుతుంటే ఇలా తనవారిని దూరం చేస్తాడా.. దేవుడే లేడంటూ ఆయన బోరుమనడం అందరినీ కంట తడి పెట్టించింది. తన కళ్ల ముందే.. తన చేతులారా.. తన కుటుంబ సభ్యులు ప్రాణాలు కోల్పోయారని లబోదిబోమన్నాడు. మృతదేహాలను సోంపేట ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. సోంపేట ఆసుపత్రి వద్దకు కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకటఅప్పారావు, సోంపేట సీఐ మంగరాజు, కంచిలి ఎస్ఐ పారినాయుడు చేరుకుని, బాధితుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


వివరాలు సేకరిస్తున్న కాశీబుగ్గ డీఎస్పీ వెంకట అప్పారావు

మంత్రి అచ్చెన్నాయుడు దిగ్భ్రాంతి..

ఈ రోడ్డు ప్రమాద ఘటనపై మంత్రి అచ్చెన్నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, ఎమ్మెల్సీ నర్తు రామారావు, జడ్పీ ఛైర్ పర్సన్ పిరియా విజయ, సోంపేట, కంచిలి ఎంపీపీలు ఎన్.దాను, దేవదాస్ రెడ్డి ఈ సంఘటనపై విచారం వ్యక్తం చేశారు.

గోమాంసం విక్రయాలు సహించం

- సినీ నటి కరాటే కల్యాణి

నరసన్నపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలం జాతీయ రహదారిపై దాబాలో అజాద్ అనే వ్యక్తి గో మాంసం విక్రయాలు చేస్తున్నట్లు సినీ నటి కరాటే కల్యాణి ఆరోపించారు. ఈమేరకు మంగళవారం నరసన్నపేట సమీపంలో ఓ దాబాలో గో మాంసం విక్రయాలు చేపడుతుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను టెక్కలి నుంచి వస్తూ దాబాలో భోజనం చేసేందుకు వెళితే గో మాంసం కావాలని అడిగారన్నారు. దీనిపై భజరంగ్‌దళ్ సభ్యులతో సోదాలు చేయించానని, దాంతో గో మాంసం అమ్మకాలు చేస్తున్నట్టు గుర్తించామన్నారు. గో మాంస విక్రయాలు ఎక్కడ జరిగినా ఉపేక్షించబోమని ఆమె హెచ్చరించారు. సంబంధిత దాబాపై ఫిర్యాదు చేస్తామన్నారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసేవిధంగా ఇలాంటి చర్యలు చేపడితే ఊరుకోబోమన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు దాబాకు చేరుకుని పరిశీలించారు.


తామరాపల్లి వద్ద ఒక దాబా వద్ద గో మాంసంలు విక్రయిస్తున్నట్లు చెబుతున్న కరాటే కళ్యాణి, భజరంగ దళ్ సభ్యులు

కేంద్రం నుంచి నిధులు తెస్తా

(ఐదో పేజీ తరువాయి)

పలు సూచనలు చేశారు. వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం అయిపోయాయని ఆరోపించారు. జిల్లా అభివృద్ధికి కావాల్సిన నిధులు, పనుల గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రధాని నరేంద్రమోదీ దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో జిల్లా మరింత ప్రగతి సాధించేలా అన్ని శాఖల అధికారులు చొరవ చూపాలన్నారు. ఉపాధి హామీ పథకం పనుల ద్వారా గ్రామాలను అభివృద్ధి చేసి, పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్న నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, శ్రీకాకుళం, నరసన్నపేట, పలాస శాసన సభ్యులు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, గౌతు శిరీష తమ నియోజకవర్గ సమస్యలపై మాట్లాడారు. జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జడ్పీ సీఈవో శ్రీధర్ రాజు, సీపీవో ప్రసన్నలక్ష్మి, 33 శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పేదల ఇళ్ల నిర్మాణంలో భారీ కుంభకోణం..

వైసీపీ ప్రభుత్వంలో పేదల ఇళ్ల నిర్మాణం పేరుతో భారీ కుంభకోణం జరిగింది. ఇళ్లు కట్టని వారికి డబ్బులు వేసి, నిర్మించిన వారికి మాత్రం మొండిచేయి చూపి తీరని అన్యాయం చేసింది. దీనిపై నేను కోర్టుకు కూడా వెళ్లాను.

-కూన రవికుమార్, ఎమ్మెల్యే, ఆమదాలవలస

రెండురోజులు పలు రైళ్ల రద్దు



పలాస, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహాకుంభ మేళా కారణంగా ఖుర్దా, విశాఖపట్నం రైల్వే డివిజన్‌లో ఈ నెల 26 నుంచి పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు ఈస్ట్‌కోస్ట్ రైల్వేచీఫ్ పాసింజర్స్ ట్రాన్స్‌పోర్టేషన్ మేనేజర్(సీపీటీఎం) మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాజమహేంద్రవరం-విశాఖపట్నం (ఎంఈఎంయూ-07466) రైలును ఈ నెల 26నుంచి ఫిబ్రవరి 28వరకూ రద్దు చేశారు. విశాఖపట్నం-రాజమహేంద్రవరం (ఎంఈఎంయూ-07467) రైలును 27 నుంచి ఏప్రిల్ 1 వరకూ, విశాఖపట్నం-విజయనగరం(ఎంఈఎంయు-07468) ఈ నెల 26 నుంచి ఫిబ్రవరి 28 వరకూ రద్దు చేశారు. అలాగే విజయనగరం-విశాఖపట్నం (ఎంఈఎంయూ-07469), విశాఖపట్నం-పలాస (ఎంఈఎంయూ-07470), పలాస-విశాఖపట్నం (ఎంఈఎంయూ-07471) రైళ్లను రైలు ఈ నెల 27 నుంచి మార్చి 1 వరకూ రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గుర్తించి రైల్వేశాఖకు సహకరించాలని కోరారు.

పథకం ప్రకారమే..

(ఐదో పేజీ తరువాయి)

పెద్దిన లక్ష్మణరావు అప్పుల కారణంగా గతంలో ఓ షాపింగ్‌మాల్‌లో దుస్తులు దొంగతనం చేశాడు. అలాగే, రూ.2లక్షల వరకు కాజేశాడు. అయినా అప్పులు తీరకపోవడంతో మళ్లీ ఏదైనా దొంగతనం చేయాలని భావించాడు. తెలంగాణ రాష్ట్రం నుంచి హోల్‌సేల్ షాపులకు ఆయిల్ తీసుకువచ్చే లారీడ్రైవర్ సజ్జు అలియాస్ కార్తీక్‌ని కలిసి దొంగతనానికి తనకు మనుషులు కావాలని చెప్పాడు. దీంతో సజ్జుకి తెలిసిన తన రాష్ట్రంలోని భద్రాచలం గ్రామానికి చెందిన యాకూబ్‌ను లక్ష్మణరావుకి పరిచయం చేశాడు. యాకూబ్ తన మేనల్లుడైన ఓ మైనర్ (2023లో హత్య కేసు నిందితుడు)కు ఈ విషయాన్ని చెప్పాడు. అతను జువైనల్ శిక్ష అనుభవించిన మరోక వ్యక్తిని లక్ష్మణరావుకి పరిచయం చేశాడు. ఆ వ్యక్తి తనకు మిత్రులైన తెలంగాణ రాష్ట్రం నాగరకర్నూల్ జిల్లా శానిపల్లి గ్రామానికి చెందిన కూరాకుల భానుప్రకాష్ అలియాస్ భాను, కొత్తగూడెం జిల్లా సారపాక గ్రామానికి చిగురుపాటి ఆంజనేయులు అలియాస్ అంజి, రాహుల్‌ను లక్ష్మణరావుకి పరిచయం చేశాడు. దీంతో భానుప్రకాష్, ఆంజనేయులు, ఓ మైనర్ (యాకూబ్ మేనల్లుడు) ఈ నెల 16న శ్రీకాకుళం చేరుకున్నారు. వీరితో కలిసి లక్ష్మణరావు రెండు రోజులపాటు నగరంలో పలు చోట్ల రెక్కీ నిర్వహించారు. ఈ నెల 18న స్థానిక ఇండియన్ బ్యాంకులో దొంగతనానికి యత్నించారు. అక్కడ రద్దీ ఎక్కువగా ఉండడంతో దాన్ని విరమించుకున్నారు. గూనపాలెనికి చెందిన వనజ ఇంట్లోకి పెళ్లి పేరుతో దొంగతనానికి వెళ్లగా వారంతా కేకలు వేయడంతో అక్కడి నుంచి పరారయ్యారు. తరువాత లక్ష్మణరావు ఇంటి సమీపంలో ఉన్న కోరాడ గోవిందరావు అనే వ్యాపారికి చెందిన షాపులో చోరీ చేయాలని భావించినా కుదర్లేదు. దీంతో నగరంలోని కాకివీధిలో ఉన్న గోవిందరావు ఇంటిని లక్ష్మణరావు చూపించాడు. ఇంట్లో గోవిందరావు భార్య, నడవలేని తల్లి మాత్రమే ఉంటారని, ఇంటికి ముందు వెనుక తోవ ఉందని, దొంగతనం చేయాలని చెప్పాడు. దీంతో ఈ నెల 21 శనివారం రాత్రి 6 గంటలకు భానుప్రకాష్, ఆంజనేయులు, ఓ మైనర్(యాకూబ్ మేనల్లుడు) గోవిందరావు ఇంట్లోకి చొరబడ్డారు. గోవిందరావు తల్లి సూర్యకుమారి, భార్య మౌనికను కత్తులతో బెదిరించి అక్కడే టీవీ దగ్గర ఉన్న రూ.12వేలను చోరీ చేశారు. అయితే అనుకోకుండా గోవిందరావు ఇంట్లో ఆ రోజు భార్య, తల్లితో పాటు ఆయన వదిన(అన్న భార్య), ఆమె కుమారుడు ఉండడంతో వారంతా దొంగలను ప్రతిఘటించారు. దీంతో దొంగలు కత్తులు పడేసి పరారయ్యారు. పోలీసులకు సమాచారం అందడంతో వారు ఘటనా స్థలానికి చేరుకున్నారు. పారిపోతున్న ఆంజనేయులు వన్‌టౌన్ రైటర్ బి.రవికుమార్ చేతికి చిక్కాడు. అతడిని విచారించగా మిగిలిన ఇద్దరి వివరాల చెప్పడంతో పోలీసులు గాలించి విశాఖపట్నంలో అదే రోజు రాత్రి పట్టుకుని శ్రీకాకుళం తీసుకొచ్చారు. వారిని విచారించగా అసలు నిజాలు బయటపడ్డాయి. ఈ కేసులో ఇద్దరి లారీ డ్రైవర్ల పాత్రపై విచారణ జరుగుతుందని డీఎస్పీ వివేకానంద తెలిపారు. ఈ కేసులో ఏ1 నిందితుడు పెద్దిన లక్ష్మణరావుతోపాటు భానుప్రకాష్, ఆంజనేయులు, మైనర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరి నుంచి రూ.10 వేల నగదు, కత్తులు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు ఛేదించిన వారిని ఎస్పీ మహేశ్వరరెడ్డి అభినందించారు. సీఐ పైడపునాయుడు, క్రైం సిబ్బంది హెచ్‌సీ బి.రవికుమార్, కానిస్టేబుళ్లు ఆర్.సూరిబాబు, ఎస్.రవికుమార్, పి.గోపాల్‌కు రివార్డులు అందించారు.

ధాన్యం అమ్మేదెలా?

- యంత్రాలతోనే కోసిన పంట కొనుగోలుకు మిల్లర్ల నిరాకరణ
- తేమ శాతం అధికమంటూ కొర్రీలు
- లబోదిబోమంటున్న రైతులు
- వెసులుబాటు ఇవ్వాలని అభ్యర్థన


ధాన్యం కోతకోస్తున్న యంత్రం

సోంపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ ధాన్యం అమ్మకాలు రైతులకు కత్తిమీద సాములా మారింది. ధాన్యం కొనుగోలుకు మిల్లరు తేమ పేరిట కొర్రీలు వేస్తున్నారు. కూలీల కొరత నేపథ్యంలో యంత్రాల వాడకాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా రైతులు తమ పంటను వరికోత యంత్రంతో సాయంతో కోస్తున్నారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు వల్ల ధాన్యం తేమ శాతం పెరిగే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం కోత యంత్రాలతో వస్తున్న ధాన్యంలో తేమ 17 శాతానికి మించకుండా ఉంటేనే కొనుగోలు చేస్తామని నిబంధనలు అన్నదాతను కుంగదీస్తున్నాయి. ఈసారి తడి, పొడి ధాన్యం కొనుగోలుకు మిల్లర్లు ససేమీరా అనడంతో రైతులు పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. లేదంటే తక్కువ ధరకు తీసుకుంటామని మిల్లర్లు చెబుతున్నారు. దీనికి తోడు ప్రభుత్వం కొన్నిచోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయటం ఆలస్యం కావడం కూడా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ధాన్యాన్ని కళ్లాల్లో ఉంచుకోలేక సమీపంలో నిల్వ చేసుకునే అందుబాటు లేక అమ్మకాలకే రైతులు మొగ్గుచూపుతున్నారు. మరోవైపు వాతావరణ ప్రభావం కూడా రైతుల్లో కలవరపాటుకు గురిచేస్తోంది. జిల్లావ్యాప్తంగా 5 లక్షల ఎకరాల్లో వరిసాగు కాగా దాదాపు 20లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం దిగుబడి రానున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే ధాన్యం కొనుగోలు కేంద్రాలు సకాలంలో ఏర్పాటు చేయడంలో మాత్రం అధికారులు విఫలం అవుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పలుచోట్ల కేంద్రాలు ప్రారంభం కాకపోగా మరికొన్ని చోట్ల ఇప్పుడిప్పుడే ప్రారంభిస్తున్నారు. ఏటా ధాన్యం కొనుగోలు కేంద్రాల ఆలస్యం కారణంగా రైతులు కమీషన్ వ్యాపారుల ద్వారా మిల్లర్లకు ధాన్యం విక్రయించడం జరుగటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. యాంత్రీకరణలో భాగంగా వరికోతలు పూర్తిగా కోత యంత్రాలతో సాగుతోంది. ఈ విధానంలో కోత చేస్తే 17 శాతం తేమ ధాన్యంలో ఉండటం సహజం. తేమ శాతం ఎక్కువగా ఉందనే నెపంతో కొనుగోలు కేంద్రాల వద్ద కూడ తీసుకోవడంలేదు. ఇటు ధాన్యం తీసుకోక, అటు ఆరబెట్టేందుకు స్థలం లేక రైతులు అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం ఏ-గ్రేడ్ ధాన్యం ధర సుమారు రూ.1900, కామన్ రకం ధర రూ.1840 ఉంది. అయితే తడి, పొడి ధాన్యం పేరుతో తక్కువ ధరకే మిల్లర్లు కొనుగోలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. దీంతో ఖరీఫ్ ధాన్యం అమ్మకం రైతులకు పెద్ద సమస్యగా మారింది. ఈనేపథ్యంలో యంత్రాల ద్వారా కోత చేసిన ధాన్యం కొనుగోలులో తేమ శాతానికి వెసులుబాటు ఇచ్చేలా పాలకులు చర్యలు చేపట్టాల్సి ఉంది.

సమస్యలపై స్పందించి పరిష్కరించండి

ఇచ్ఛాపురం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో సమస్యలపై స్పందించి పరిష్కరించాలని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు కోరారు. మంగళవారం ఇచ్ఛాపురం మండలపరిషత్ సమావేశం ఎంపీపీ బోరపుష్ప అధ్యక్షతన జరిగింది. వర్షాలకు ధాన్యం తడిచిపోవడంతో రైతులకు న్యాయం చేయాలని ఎంపీటీసీ సభ్యురాలు దక్కత ఏకాంబరి, సర్పంచ్ ఢిల్లీరావు కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామారావు, ఎంపీపీ పుష్ప, ఎమ్మెల్సీ నర్తు రామారావు, జడ్పీటీసీ అంబటి నారాయణమ్మ, కేశుపురం సర్పంచ్ ఢిల్లీరావు, ఎంపీటీసీ చక్రవర్తి పాల్గొన్నారు.

రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

ఇచ్ఛాపురం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు తడిచిపోవడంతో రంగుమారిన ధాన్యం కొనుగోలు చేయాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు డిమాండ్ చేశారు. మంగళవారం ఇచ్ఛాపురంలో విలేకరులతో మాట్లాడుతూ అకాల వర్షాలకు అతలాకుతలమైన రైతులకు ప్రభుత్వం భరోసాకల్పిస్తూ స్పష్టమైన ప్రకటన రావాలన్నారు. రైతులకు పెట్టుబడి సహాయం కింద 20 వేలుఇస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీఏమయ్యిందని ప్రభుత్వానికి ప్రశ్నించారు.

ప్రజలపై భారం మోపడం తగదు

ఆమదాలవలస, డిసెంబరు24 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లోపే 15 వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపడం తగదని ఆమదాలవలస నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ ఆరోపించారు. మంగళవారం ఆమదావలసలో ఈనెల27న చేపట్టనున్న పోరుబాట పోస్టర్‌ను నియోజకవర్గ నాయకులతో కలిసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 27న ఆమదాలవలస రైల్వేస్టేషన్ దరిలో ఉన్న వన్‌వే జంక్షన్ వద్ద నిర్వహించే పోరుబాట కార్య క్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.

● కంచిలి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలను పెంచి, ప్రజలపై భారం మోపడం సరికాదని ఎమ్మెల్సీ నర్తు రామారావు, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ తెలిపారు. కంచిలిలో విద్యుత్ చార్జీల పెరుగుదలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

అయ్యప్పస్వామి ఆలయ ధర్మకర్త మృతి

ఇచ్ఛాపురం, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురంలోని పంచాయతన అయ్యప్పస్వామి ఆలయ ధర్మకర్త దుర్గా గురుస్వామి మంగళవారం మృతి చెందారు. నాలుగు దశాబ్దాలుగా అయ్యప్ప మాలాధారణ చేస్తున్నారు. ఆయనతో ఇచ్ఛాపురంతోపాటు చుట్టుపక్కలు, ఒడిశాలోని పలుగ్రామాల్లో అయ్యప్పభక్తులకు మాలాధారణ చేస్తుండేవారు. దుర్గాగురుస్వామి మాలలో ఉండగా గుండెపోటు రావడంతో ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందారు. ఈమేరకు పట్టణ ప్రముఖులు సంతాపం తెలిపారు.

సమస్యలపై పోరాటం చేయండి

సరుబుజ్జిలి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై తమ పక్షాన పోరాటం చేయాలని పీఆర్ మినిస్ట్రీరియల్ ఉద్యోగం సంఘం జిల్లా అధ్యక్షుడు ఎ.గజపతిరావు కోరారు. ఈమేరకు మంగళవారం కొత్తకోట జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలను పరిశీలించిన ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడుకు పీఆర్ సంఘం తరపున వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అటెండర్ క్యాడర్ నుంచి రికార్డు అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్ నుంచి జూనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతలు విషయంపై ప్రభుత్వంతో పోరాడాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు భైరి అప్పారావు, శ్రీనివాస్, లావేటి గోపి, కంచరాన రామకృష్ణ, రాజు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల విద్యార్థులపై శ్రద్ధ: ఎంఈవోలు

కవిటి,డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి):ప్రత్యేకఅవసరాల విద్యార్థులపై శ్రద్ధ చూపుతున్నామని ఎంఈవోలు ధనుంజయ మద్ది, కె.చిట్టిబాబు తెలిపారు. మంగళవారం కవిటి బెహరావీధిలో ప్రత్యేకఅవసరాల విద్యార్థుల ఇంటికి వెళ్లి పరిశీలించారు. ప్రభుత్వం అందజేస్తున్నసౌకర్యాలు, అలవెన్స్‌ల గురించి తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. భవితకేంద్రాల ద్వారా ప్రత్యేకఅవసరాల విద్యార్థులకు రూ.2.17లక్షలు అందించామని తెలిపారు. కార్యక్రమంలో పీఈఆర్‌పీ కృష్ణారావు పాల్గొన్నారు.

గ్రేడ్-6 కార్యదర్శుల కార్యవర్గం ఎన్నిక

జి.సిగడాం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి):గ్రేడ్-6 పంచాయతీ కార్యదర్శి మండల యూనియన్ కార్యవర్గ ఎన్నిక మంగళవారం ఎంపీడీవో జి.రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. అధ్యక్షుడిగా ఎ.మోహన్ గణేష్, కార్యదర్శిగా పొగిరి రాము, కోశాధికారిగా పి.చక్రధర్, అసోసియేషన్ సభ్యులుగా టి.సాయికుమార్, పి.శ్రావణ భార్గవి, జె.సంతోష్‌కుమార్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సీహెచ్‌సీలో సమస్యలు పరిష్కరించండి

ఇచ్ఛాపురం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం సీహెచ్‌సీలో సమస్యలను పరిష్కరించాలని సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి కోరారు. ఈమేరకు మంగళవారం సీహెచ్‌సీని పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఇన్‌పేషెంట్లకు భోజన సదుపాయం కల్పించాలని కోరారు.

స్నేహితురాలి కుటుంబానికి ఆర్థికసాయం

లావేరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): లావేరుకు చెందిన లంకలపల్లి సునీత కుటుంబానికి స్నేహితులు అండగా నిలిచారు. ఈమేరకు లంకలపల్లి సునీత లావేరు జడ్పీ హైస్కూల్‌లో 2005 పదో తరగతి చదివింది.అనంతరం వివాహం కాగా ఇటీవల మృతిచెందింది.ఈమేరకు ఆమెతో చదువుకున్న స్నేహితులు కుటుంబ సభ్యులకు రూ.40 మంగళవారం అందజేశారు.ఆమె ఇద్దరి పిల్లలకు అండగా అండగా ఉంటామని భరోసాఇచ్చారు. కార్యక్రమంలో రాజేష్, కిషోర్ కుమార్, సత్యనారాయణ, గండి సురేష్ పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పనే ధ్యేయం

● కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు

అరసవల్లి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనే ధ్యేయంగా నైపుణ్యాభివృద్ధి సంస్థను రాష్ట్ర ప్రభుత్వం నెలకొల్పిందని కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. మంగళవారం శ్రీకాకుళంలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో వివిధ పారిశ్రామిక సంస్థల యాజమాన్య ప్రతినిధులతో హెచ్‌ఆర్ కాంక్లేవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడికి వెళ్లినా ఉత్తరాంధ్రకు చెందిన కార్మికులు కనిపిస్తారని, సమస్యకు పరిష్కారం చూపేలా, జిల్లాలో వేలాదిమందికి ఉపాధి కల్పించేలా పారిశ్రామికవేత్తలు ఉద్యోగ విప్లవానికి నాంది పలకాలని పిలుపునిచ్చారు. జిల్లాలో కొత్త పరిశ్రమల స్థాపన, ఉపాధి కేంద్రాల ఏర్పాటుద్వారానే ఇది సాధ్యమన్నారు. ఇందుకు అనుగుణంగా పారిశ్రామికవేత్తలు, పరిశ్రమల ప్రతినిధులు సహకారం అందించాలనికోరారు. కొత్తగా పరిశ్రమలు, పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో నూతన పారిశ్రామిక విధానాన్ని తీసుకువచ్చామని చెప్పారు.ఇదేస్ఫూర్తితో ఇన్వెస్ట్ ఇన్ శ్రీకాకుళం పేరిట జిల్లాలో పారిశ్రామికవేత్తలతో సదస్సు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా యువతకు పలు రంగాల్లో శిక్షణ ఇవ్వనున్నామని, నిరుద్యోగులు ఉద్యోగ అన్వేషణలో సమయం వృథా చేయకుండా, ప్రతికుటుంబం నుంచి ఒక వ్యాపారవేత్త తయారు కా వాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని చెప్పారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు మెండ దాసునాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు


ఇచ్ఛాపురం: బెల్లుపడలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు


కవిటి బీల ప్రాంతంలో తడిసిన వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

పొలాల్లో నీరు.. అన్నదాతకు కన్నీరు

● రైతుల్లో ఇంకా వీడని తుఫాన్ భయాందోళనలు

జిల్లాలో అలపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు అన్నదాతకుఅగచాట్లు తప్పడంలేదు. తుఫాన్ భయాందోళన ఇంకా రైతులను వెంటాడుతోంది. ఈనేపథ్యంలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు పొలాల్లో నీరుచేరడంతో కోత కోసిన పంట కుళ్లిపోయే ప్రమాదముందని రైతులు ఆందోళనచెందుతున్నారు. కొన్నిచోట కోతకోసిన తర్వాత ఆదరాబాదరాగా కుప్పలుపెట్టారు. అయితే కుప్పల్లోకి నీరు వెళ్లే అవకాశముందని పలువురు కన్నీరుమున్నీరవుతన్నారు.ఈనేపథ్యంలో పంటపొలాలను అధికారులు పరిశీలించారు.

● సోంపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి: మండలంలోని మామిడిపల్లి, బారువ, పలాసపురం గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన పొలాలను వ్యవసాయ అధికారులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమదాలవలస కృషి విజ్ఞానకేంద్రం సస్యరక్షణ నిపుణులు ఎస్.అనూష, వ్యవసాయశాఖ ఏడీ కె.జగన్మోహనరావు, ఏవో బి.నరసింహమూర్తి రైతులకు పంటను రక్షించుకోవడానికి సూచనలుచేశారు.

● ఇచ్ఛాపురం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): బెల్లుపడ, ఈదుపురంల్లో తడిసిన ధాన్యం, పొలాల్లో నేలకొరిగిన వనలు, వరి పంట పొలాలను ఏవో టి.భార్గవి, వ్యవసాయ సహాయకులు మల్లేశ్వరరావు, నీటి సంఘ అధ్యక్షుడు ధనుంజయరెడ్డి పరిశీలించారు.

● కవిటి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి):కవిటి, పుటియాదల ఏరియాలో వరిపొలాలను కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త అనూష పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఏడీ జగన్మోహన్‌రావు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కవిటి, సోంపేట వ్యవసాయ శాఖ అధికారులు నరసింహమూర్తి, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

27న సీనియర్ రాష్ట్రస్థాయి వాలీబాల్ ఎంపికలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి):సీనియర్ వాలీబాల్ రాష్ట్రస్థాయి వాలీబాల్ ఎంపికలను ఈనెల27న విజయవాడలో నిర్వహించనున్నట్లుజిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో జరిగేఎంపికలకు ఆసక్తిగల క్రీడాకారులు ఆధార్‌కార్డు, నేటివిటీ, పది పాస్‌పోర్టు ఫోటోలతో హాజరు కావాలని పేర్కొన్నారు. వివరాలకు శిక్షకులు కె.హరికృష్ణ 9505133888 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

విజిలెన్స్ మానటరింగ్ కమిటీ సభ్యుడిగా ధనుంజయరావు

ఆమదాలవలస,డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల పోరం మండలాధ్యక్షుడు తాలాబత్తుల ధనుంజయరావును జిల్లా సాంఘికసంక్షేమశాఖ ఆధ్వర్యంలో గల ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానటరింగ్ కమిటీ సభ్యుడిగా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సోమ వారం జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీలో కలెక్టర్ చైర్మన్‌గా, ఎస్పీ, ఎంపీ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు కీలక ప్రతినిధులుగాఉంటారని పేర్కొన్నారు. ఈమేరకు ఆమదాలవలసకు చెందిన ధనుంజయరావు కమిటీలో తనకు కల్పించడంతో కలెక్టర్, ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఆదియోగి విగ్రహావిష్కరణ

ఇచ్ఛాపురం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): బాహుదానదీ తీరంలోని పతాంజలి ఆశ్రమం వద్ద ఆదియోగి విగ్రహాన్ని వ్యాదధర్మ ప్రచారకులు యోగాచార్య పరమానంద గురూజీ, శ్రీనివాసానంద్ మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో విగ్రహ దాత సంజీవ్‌రెడ్డి, మునిసిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు, చాట్ల తులసీదాస్‌రెడ్డి, కృష్ణారావుపాత్రో తదితరులు పాల్గొన్నారు.

కిరాణా దుకాణాల్లో తనిఖీలు

గార, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గారలో కిరాణా షాపులో మంగళవారం సాయంత్రం కేనాన్ జాగిలంతో తనిఖీలు నిర్వహించారు. గంజాయి అమ్మకాల పసిగట్టేందుకు ఏఆర్‌హెడ్ క్వార్టర్ నుంచి పంపించిన శిక్షణ పొందిన కేనాన్ జాగిలంతో తనిఖీ చేస్తున్న విషయం విదితమే. తనిఖీల్లో ఎక్కడా గంజాయి లభించలేదని ఎస్ఐ జనార్దనరావు తెలిపారు.

వినియోగదారుల హక్కులు తెలుసుకోవాలి

● జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ పిలుపు


విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేస్తున్న జేసీ అహ్మద్‌ఖాన్, ఎమ్మెల్యే రవికుమార్

శ్రీకాకుళం కలెక్టరేట్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): వినియోగదారులు తమ హక్కుల గురించి పూర్తిగా తెలుసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ పిలుపునిచ్చారు. మంగళవారం శ్రీకాకుళంలోని బాపూజీ కళామందిర్‌లో జరిగిన జాతీయ వినియోగదారుల దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, ఫర్మాన్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ వినియోగదారులకు నష్టం జరిగితే సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. చట్టంపై అవగాహన లేకపోవడంతో వినియోగదారులు నష్టపోతున్నారని తెలిపారు. కొనుగోలు చేసిన వస్తువుల్లో నిర్దేశిత ప్రమాణాల్లో లోపం ఉంటే వారిని ప్రశ్నించే హక్కు ఈచట్టం ద్వారా కొనుగోలుదారునికి ఉందని తెలిపారు. కొనుగోలు చేసిన వాటికి బిల్లులను తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కల్తీ ఆహారం వల్ల పలువురు క్యాన్సర్, కిడ్నీవ్యాధి బారినపడుతున్నారని తెలిపారు. అనంతరం నిర్వహించిన వివిధపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, పతకాలు, నగదు బహుమతులను అందజేశారు. తొలుత వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు డ్రగ్ కంట్రోల్, తూనికలుకొలతలు, భారత్, హెచ్‌పీగ్యాస్, ఉద్యాన తదితరశాఖలు ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాళ్లను అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు.కార్యక్రమంలో డీఎంహెచ్‌వో బి.మీనాక్షి, డీసీహెచ్ఎస్ కళ్యాణబాబు, జీఎస్టీ సహాయ కమిషనర్ రాణీ మోహన్, గంజి ఎజ్రా బుడుమూరు శ్రీరామ్మూర్తి, అధికారులు, వినియోగదారులు పాల్గొన్నారు.

మంచిపేరు వచ్చేలా పనిచేయండి: ఎంపీ

రణస్థలం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయం సిబ్బంది ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో కీలక పా త్ర పోషిస్తున్నారని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీ క్యాంపు కార్యాలయంలో సచివాలయం ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను ఎంపీ ఆవిష్కరించారు. సచివాలయం సిబ్బంది ప్రభుత్వానికి మంచి పేరు వచ్చే విధంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం ఉపాధ్యక్షుడు జి.కిరణ్‌కుమార్, చంద్రశేఖర్, జాయింట్ సెక్రటరీ లక్ష్మణరావు, ఆదినారాయణ, రమేష్ పాల్గొన్నారు.

లావేటిపాలెంలో టీడీపీ సభ్యత్వ నమోదు

లావేరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎచ్చెర్ల ఏఎంసీ మాజీ చైర్మన్ ఇనపకుర్తి తోటయ్యదొర తెలిపారు. మంగళవారం లావేరు పంచాయతీ లోని లావేటిపాలెంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఇనపకుర్తి రమణ, లంకలపల్లి అచ్చుతరావు, సురేష్, సీతారామరాజు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో సదుపాయాల కల్పనకు కృషి

● ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు


ఎచ్చెర్ల: ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న ట్రిపుల్ ఐటీ అధికారులు

ఎచ్చెర్ల, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్‌లో(ట్రిపుల్ ఐటీ) మౌలిక సదుపాయాల కల్పనకు కృషిచేస్తానని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు హామీఇచ్చారు. ట్రిపుల్ ఐటీ క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ, ఏవో ముని రామకృష్ణ నడుకుదిటివానిపాలెంలోని ఎమ్మెల్యే క్యాంపస్‌లో మంగళవారం కలిశారు. క్యాంపస్‌లో అంతర్గత రోడ్డు నిర్మించాలని, అసంపూర్తిగా ఉన్న ప్రహరీని పూర్తిచేయాలని, తాగునీటికి శాశ్వత పరిష్కారం చూపాలని ఎమ్మెల్యేను కోరారు. అదనపు తరగతి గదులు, వసతి గృహం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, ఎచ్చెర్ల పాత జాతీయ రహదారి నుంచి క్యాంపస్ వచ్చే వరకు రహదారి పొడవునా విద్యుత్ దీపాలు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని కోరినట్లు ట్రిపుల్ ఐటీ అధికారులు చెప్పారు. రహదారి పొడవునా దీపాల కోసం సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడారని, మిగిలిన సమస్యలను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషిచేస్తామని ఎమ్మెల్యే హామీఇచ్చారని తెలిపారు.


సమస్యలు పరిష్కరించాలి

రణస్థలం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యలు పరిష్కారం దిశగా అధికారులు పనిచేయాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు కోరారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపుకార్యాలయంలో హౌసింగ్ సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి

పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి: ఎస్పీ

శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జాతీయ రహదారిపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి సారించాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి కోరారు. అపరిష్కృతంగా ఉన్న ఆస్తి, మహిళలకు సంబంధించిన కేసులపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో గంజాయిని పూర్తి స్థాయిలో అరికట్టాలని సూచించారు. మంగళవారంజిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులతో ఎస్పీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఇటీవల జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టం వాటిల్లిందని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా జాతీయరహదారిపై గుర్తించిన ప్రమాద స్థలాల వద్ద వేగనియంత్రణ చర్యలు తీసుకోవాలని కోరా రు. జాతీయరహదారులపై వాహనాలు నిలిపివేయకుండ హైవే పెట్రోలింగ్ సిబ్బంది చర్యలు చేపట్టాలని తెలిపారు. పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని కోరారు. గ్రామాలను సందర్శించాలని అక్కడి పరిస్థితులను సమీక్షించి నేరాలు జరగకుండా చొరవ చూపాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన వారి లైసెన్సులు రద్దుచేయాలని, పేకాట శిబిరాలు, బెల్టుషాపులపై దాడులు నిర్వహించాలని ఆదేశించారు. గంజాయి కేసులో అరెస్టై విడుదలైన నిందితులపై నిఘా ఉంచాలన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టుల వద్ద ఉన్న సిబ్బంది నిరంత రం అప్రమత్తంగా ఉండాలని, సంకల్పం పేరిట మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు.సైబర్ నేరాలు,రోడ్డు భద్రతపై కూడా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదే శించారు. పాతముద్దాయిలు, రౌడీషీటర్ల కదలికపై దృష్టి సారించాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ కేవీ రమణ, డీఎస్పీలు వివేకానంద, మూర్తి, ఏవో గోపినాథ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

భూహక్కు పత్రాలు ఇవ్వండి: ప్రభుత్వ విప్ అశోక్

కవిటి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): కవిటి మండలంలోని భైరిపురంలో 100 కుటుంబాలకు 1975లో డిపట్టాలుగా పంపిణీచేసిన బంజరు భూమికి భూహక్కు పత్రాలు ఇవ్వాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ కోరారు.ఈమేరకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌పుండర్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భైరి పురం పంచాయతీలోని సర్వే నెంబరు 143, 169, 170,171లో సుమారు 42.05 ఎకరాలు భూమిని డిపట్టాలు అందించారని తెలిపారు.


సీఎంఆర్‌ఎఫ్‌కు సంబంధించిన ప్రొసీడింగ్ అందజేస్తున్న అశోక్

● సోంపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జింకిభద్రకు చెందిన కరిబిల్లి దమయంతి కిడ్నీ వ్యాధితో బాధపడుతుండడంతో ప్రభుత్వం అండగా నిలిచింది. సీఎం రిలీఫ్‌ఫండ్ రూ.35 వేలును చెక్కు మంజూరయ్యింది. ఈ మేరకు కవిటి మండలంలోని రామయ్యపుట్టుగ జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ మంగళవారం దమయంతి కిడ్నీ ఆపరేషన్ కోసం సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరుచేసిన చెక్కు ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చిత్రాడ శ్రీనివాసరావు, జుత్తు పురుషోత్తం పాల్గొన్నారు.

క్రైం కార్నర్

డివైడర్ పైకి దూసుకుపోయిన లారీ

● తప్పిన ప్రమాదం ● డ్రైవర్ నిద్ర మత్తుతో ఘటన



ఫరీద్‌పేట జంక్షన్‌కు సమీపంలో సర్వీసు రోడ్డులో అడ్డంగా తిరిగిన లారీ

ఎచ్చెర్ల, డిసెంబరు 24 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని ఫరీద్‌పేట జంక్షన్ సమీపంలో మంగళవారం వేకువజామున పెను ప్రమాదం తప్పింది. ఓ లారీని డ్రైవర్ నిద్ర మత్తులో జాతీయ రహదారి డివైడర్ ఎక్కించాడు. అనంతరం ఐరన్ రెయి లింగ్ వైపు దూసుకుపోయి సర్వీసు రోడ్డులో అడ్డంగా తిరిగింది. స్థానికుల కథనం మేరకు.. విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వైపు వస్తున్న లారీ ఫరీద్‌పేట జంక్షన్‌లో డ్రైవర్ నిద్రమత్తు వల్ల స్టీరింగ్ అదుపుతప్పింది. దీంతో డివైడర్ ఎక్కి కొద్ది దూరం వరకు ఐరన్ రెయిలింగ్ దాటి దూసుకువచ్చి సర్వీసు రోడ్డులో అడ్డంగా తిరిగింది. దీంతో సర్వీసు రోడ్డులో మధ్యాహ్నం వరకు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఆ సమయంలో సర్వీసు రోడ్డులో వాహనాల రాకపోకలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ సంఘటనపై ఎటు వంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. ఇటీవల ఇదే జంక్షన్‌లో కొబ్బరి బొండాల లారీ డివైడర్‌పైకి దూసుకువచ్చి హైటెన్షన్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన విషయం తెలిసిందే.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన జోగయ్య మృతి

శ్రీకాకుళం క్రైమ్/పాతపట్నం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పాతపట్నం మండలంలోని కొరసవాడ వద్ద ఎమ్మెల్యే గోవిందరావు తనయుడి వాహనం ఆటోను ఢీకొన్న ఘటనలో గాయపడిన భామిని మండలం లివిరి గ్రామానికి చెందిన సీహెచ్ జోగయ్య చికిత్సపొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఎస్‌ఐ లావణ్య కథనం మేరకు.. పాతపట్నం మండలంలోని కొరసవాడ వద్ద ఈనెల 21న ఆటోను కారు ఢీకొన్న ఘటనలో భామిని మండలానికి చెందిన సీహెచ్ జోగయ్యతో పాటు మరో నలుగురు తీవ్ర గాయపడిన సంగతి తెలిసిందే. గాయపడిన వారిని శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స కోసం చేర్పించారు. అయితే వీరిలో జోగయ్య ఆరోగ్య పరిస్థితి విషమించడంతో రిమ్స్ నుంచి శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. పాతపట్నం సీఐ రామారావు, ఎస్‌ఐ లావణ్య ఆసుపత్రికి చేరుకున్నారు. జోగయ్య కుటుంబ సభ్యుల వద్ద రిపోర్టు తీసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు.

15 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

జి.సిగడాం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాండ్రంగి పంచాయతీ పరిధి చీడిపేట పాత బస్టాండ్ వద్ద పేకాట శిబిరంపై మంగళవారం పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న 15 మందిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ వై.మధుసూదన రావు తెలిపారు. జి.సిగడాం మండలంలోని మెట్టవలస, పొందూరు, రాపాక గ్రామాలకు చెందిన 15 మంది నుంచి రూ.1,39,180 నగదు, 15 సెల్‌ఫోన్లు, రెండు కార్లు, 11 మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆదివారంపేటలో ఆరుగురు..

శ్రీకాకుళం క్రైమ్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని ఆదివారంపేట సమీపంలో ఆరుగురు పేకాటరాయుళ్లు పోలీసులకు పట్టుబడ్డారు. రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఆదివారం పేట సమీపంలో మంగళవారం రాత్రి ఆరుగురు పేకాట ఆడుతుండగా రెండో పట్టణ పోలీసులు దాడులు నిర్వహించారు. పట్టుబడిన వారి నుంచి రూ.9680 నగదు, మూడు బైక్‌లు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై సీఐ ఈశ్వరరావు కేసు నమోదు చేశారు.

21 మద్యంసీసాలు స్వాధీనం

బలగ మెట్టు జంక్షన్ వద్ద నర్రం శ్యామల నుంచి రూ.2530 విలువ చేసే 21 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. అనధికారికంగా మద్యం విక్రయిస్తుండడంపై రెండో పట్టణ పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. ఈ మేరకు ఆమెపై సీఐ కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

700 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

సోంపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మందస మండలంలోని సవరమధ్య గ్రామంలో సారా తయారీకోసం ఉపయోగించే 700 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ కె.బేబీ తెలిపారు. కంచిలి మండలంలోని గోపికేళి వద్ద సారా తరలిస్తుండగా సిబ్బంది దాడులు చేశారని చెప్పారు.ఈ మేరకు ఏఎస్‌పల్లికి చెందిన భీమారావు వాహనంతోపాటు 600 ప్యాకెట్ల సారాను విడిచిపెట్టి పారిపోయినట్లు తెలిపారు. ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పాతకేసులకు సంబంధించి 11 మందిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు చెప్పారు.

సారా తరలిస్తున్న మహిళపై కేసు

పాతపట్నం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పూతికగూడ గ్రామంలో సవర పార్వతి 2.5 లీటర్ల సారా తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ కె.కృష్ణారావు తెలిపారు. ఆమెపై కేసు నమోదు చేసి మంగళవారం నరసన్నపేట కోర్టులో హాజరుపరిచామన్నారు. జనవరి 3వ తేదీ వరకు రిమాండ్ విధించగా సబ్ జైలుకు తరలించామన్నారు.

శివరామపురంలో ఎయిర్ పోర్టు నిర్మించాలి

● అలా అయితే కేంద్రమంత్రికి ప్రచారం చేస్తా
● మాజీ మంత్రి అప్పలరాజు



పలాస, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఉద్దానంలో ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయడం వల్ల నష్టమే తప్ప లాభం లేదని, నగరంపల్లి పంచాయతీ శివరామపురం ప్రాంతంలో ఉన్న 1,850 ఎకరాల ప్రభుత్వ స్థలంలో ఎయిర్‌పోర్టు నిర్మిస్తే పైసా ఖర్చు లేకుండా పనులవుతాయని మాజీ మంత్రి డా.సీదిరి అప్పలరాజు అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. శివరామపురంలో ఎయిర్‌పోర్టు నిర్మించేందుకు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు చర్యలు తీసుకుంటే తాను విమర్శించిన చోటే ఆ గ్రామాల్లో గజ్జెకట్టుకుని ఆయన కోసం ప్రచారం చేస్తానన్నారు. ఎయిర్‌పోర్టు కావాలి, ఉద్దానం ప్రజల మనోభావాలు గౌరవించాలని కోరారు. ఉద్దానం గుండె కాయ రామ్‌పురం గ్రామంలో విలువైన జిరాయతీ భూములున్నాయని, అటువంటి భూముల్లో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి స్థల సేకరణ చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజలతో చర్చించకుండా, వారి మనోభావాలను గుర్తించకుండా స్థల సేకరణ చేయడం ఏమిటని ప్రశ్నించారు. టీడీపీ నేత బడ్డ నాగరాజు హత్యకు జరిగిన కుట్రపై విలేకరులు వేసిన ప్రశ్నకు ఆయన స్పందిస్తూ.. హత్యా రాజకీయాలకు తాను దూరమని, పోలీస్ స్టేషన్‌లో తమ నాయకులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. పోలీస్ స్టేషన్‌లోనే తమ వారిపై దాడి జరిగినా తిరిగి ఎదురు కేసులు పెట్టడాన్ని తప్పుబట్టారు.

28 నుంచి ఐతమ్‌లో జాతీయస్థాయి హ్యాకథాన్ పోటీలు

టెక్కలి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): సమాజంలో ఉన్న సమస్యలను గుర్తించి వాటికి సాంకేతిక పరిష్కారాలను కనుగొనేందుకు గాను జాతీయ స్థాయి హ్యాకథాన్ పోటీలు ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్, ప్రొఫెసర్ వీవీ నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేక రులతో మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఆసక్తి ఉన్న విద్యార్థులు ఒకేచోట 48 గంటల పాటు కళాశాలలో ఏర్పాటు చేసిన వేదికను ఉపయోగించుకోవచ్చన్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఐఐటీ, ఎన్‌ఐటీ, డీమ్డ్ యూనివర్సిటీలు, ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాలలు 18 రాష్ట్రాల నుంచి 1,500 బృందాలు తమ పేర్లను ఇప్పటికే నమోదు చేసుకోగా ఆన్‌లైన్‌లో ఐదు రౌండ్లు పరిశీలించి 70 బృందాలను ఎంపిక చేశారన్నారు. వివిధ అంశాల్లో సమస్యలను గుర్తించి వాటికి సాంకేతిక పరిష్కారం చూపేందుకు అవకాశం ఉందన్నారు. వీటిలో ఉత్తమంగా గుర్తిం చిన ప్రాజెక్టులకు నగదు పురస్కారం అందిస్తామన్నారు. సమావేశంలో కన్వీనర్ డాక్టర్ సతీష్‌కుమార్, సంతోష్‌కుమార్, శ్రావ్య తదితరులు పాల్గొన్నారు.

వీడని వర్షం.. ఆందోళనలో రైతులు



ఎల్ఎన్‌పేట: తురకపేట సమీపంలో నీట మునిగిన పంట పొలాలు



పలాస: గంగువాడలో నానుతున్న వరి కంకులు



పాతపట్నం: శివరాంపురంలో ధాన్యం మొలకలను చూపుతున్న రైతు

ఎల్.ఎన్.పేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లాలో మళ్లీ రైతుల్లో కలవరం మొదలైంది. గడచిన వారం రోజులుగా మబ్బులు వీడడం లేదు.. మధ్యలో ఓ రెండు రోజులు ఎండ వచ్చినా మరలా సోమవారం రాత్రి నుంచి మంగళవారమంతా వాతావరణంలో మార్పు సంభవించి చిరు జల్లులు కురుస్తున్నాయి. దీంతో పంటలను రక్షించు కోవడంలో రైతులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఒకపక్క ఇంకా నీటిలోనే పంటలు ఉండగా మరో పక్క ఎండిన ధాన్యం కూడా రంగుమారడంతో పాటు మొలకలు వస్తున్నాయని రైతులు వాపోతున్నారు. మం గళవారం రోజంతా అక్కడక్కడా వర్షంతో పాటు చిరుజల్లులు కురుస్తూనే ఉన్నాయి. ఏడీఏలు రవీంద్రభారతి, శ్రీనివాసరావు, లింగాల మధుబాబు, ఏవోలు సునీత, ఆర్.అప్పారావు, కె. సురేష్, పి.శ్రీకాంత్ వర్మ, దాన కర్ణుడు, ఎస్. గోవిం దరావు తదితరు లు క్షేత్ర స్థాయిలో పర్యటించి పంట లను రక్షించుకు నేందుకు సూచనలు, సల హాలు అందించారు. పొలాల నుంచి నీటిని తీసి వేయాలన్నారు.

-ఆంధ్రజ్యోతి బృందం

వీఆర్వోల సంఘ కార్యవర్గం ఎన్నిక

పాతపట్నం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): వీఆర్వోల సంఘ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో వీఆర్వోల సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా బి.మురళీకృష్ణం నాయుడు, కార్యదర్శిగా ఎం.అలేఖ్య, ఉపాధ్యక్షురాలిగా పి.శ్రావణి, కోశాధికారిగా కె.శామ్యూల్ వాస్లే ఎన్నికయ్యారు. అలాగే సహాయ కార్యదర్శిగా ఎం. సునీల్ కుమార్, డివిజినల్ కమిటీ సభ్యుడిగా బి.అన్నాజీరావు, జిల్లా కమిటీ సభ్యుడిగా కె.ఈశ్వరరావు ఎంపికైనట్లు నూతన అధ్యక్షుడు తెలిపారు.

'వివరాలు లేకుండా సంతకం చేయించారు'

జలుమూరు, డిసెంబరు 24: (ఆంధ్రజ్యోతి) స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం. ఇప్పిలి వేణుగోపాలరావు పాఠశాలకు పిలిపించి వివరాలు చెప్పకుండా కాగితంపై సంతకం చేయించారని, నా అమాయకత్వాన్ని తన స్వార్థానికి వాడుకున్నారని పాఠశాల యాజమాన్య కమిటీ అధ్యక్షురాలు కింజరాపు పద్మ తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం గ్రామ పెద్దల సమక్షంలో విలేకరులతో మాట్లాడారు. జూనియర్ కళాశాల సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయుల మధ్య తగాదా తనకు పూర్తిగా తెలియదన్నారు. పాఠశాల అభివృద్ధి కోసమని పేపరుపై సంతకం చేశాను తప్ప వీరి మధ్య వివాదంపై పోలీసులకు ఫిర్యాదు అంశం తనకు తెలియదన్నారు. మంగళవారం పత్రికల్లో వచ్చిన విషయాన్ని గ్రామపెద్దలు తన దృష్టికి తీసుకువచ్చారని, ఈ ఫిర్యాదుకు తనకు ఎటువంటి సంబంధం లేదని ఆమె స్పష్టం చేశారు.

ఇంటి నుంచే పరిశుభ్రత పాటించాలి

మెళియాపుట్టి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటి నుంచి పరిశుభ్రత పాటించాలని ఎంపీడీవో ప్రసాద్ పండా తెలిపారు. మంగళవారం జాడుపల్లిలో చెత్తబుట్టలను పంపిణీ చేశారు. పతి ఒక్కరు తడి, పొడి చెత్తలను వేరు చేసి పనివారలకు అందించాలన్నారు. సర్పంచ్ గాయత్రి ఎంపీటీసీ సభ్యురాలు సుజాతారాజు, కార్యదర్శి వనజాక్షి పాల్గొన్నారు.

గిరిజన రైతులను ఆదుకోవాలి



నిరసన తెలుపుతున్న గిరిజన సంఘ నాయకులు

కొత్తూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాల వల్ల నష్టపోయిన గిరిజన రైతులను ఆదుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న డిమాండ్ చేశారు. గొట్టిపల్లిలో అకాల వర్షాల వల్ల వరి పంట నేల కొరగగా వాటిని మంగళవారం పరిశీలించారు. వరి పంట నష్టపరిహారం ఎకరాకు రూ.30 వేలు చెల్లించాలని, రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన రైతులు నిమ్మక అప్పన్న, నిమ్మక లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలు



పాతపట్నం: సీహెచ్‌సీలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం

టెక్కలి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు గ్రామాలు, పట్టణాల్లో క్రిస్మస్ వేడుకలు మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో డివిజనల్ అధికారులతో కలిసి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఏసుక్రీస్తు లోక రక్షకుడని ఆయన అన్నారు. ప్రేమ, కరుణ, క్షమాగుణం, త్యాగం వంటివి అందరిపై చూపారని, క్రీస్తు శాంతి దూత అని తెలిపారు. అనంతరం కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో తహసీల్దార్లు దిలీప్‌చక్రవర్తి, అప్పలరాజు, టెక్కలి నియోజకవర్గ పాస్టర్ల సంఘ ప్రతినిధులు కణితి అబ్రహం, వైఎస్ ఏలియా, డేవిడ్ మోహన్, సుధాకర్, రతన్‌రాజు, కాలేబ్, రాబర్ట్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యలో..

ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం క్రిస్మస్ సంబరాలు నిర్వహించారు. డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు కేక్‌ను కట్‌చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు, ప్రొఫెసర్ డాక్టర్ విష్ణుమూర్తి, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక ఆసుపత్రిలో..

పాతపట్నం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక సామాజిక ఆసుపత్రిలో కొరసవాడ ఆంధ్రా బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో మంగళవారం క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. డా. గిడుతూరి వేణుగోపాలరావు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. పాస్టర్ ఎస్.ఫిలిప్ వైద్యులకు, సిబ్బందికి, రోగులకు క్రిస్మస్‌క్రిస్టమస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బి.అనిల్ కుమార్, కె.లారెన్స్, సువర్ణ బెహరా పాల్గొన్నారు.

● నరసన్నపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నరసన్నపేట పట్టణంలో మంగళవారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. సెయింట్ క్లారెట్, కల్వరి తదితర చర్చిల్లో ఈ వేడుకలు చేపట్టారు. ఎంఆర్ జ్యోతిఫెడ్రరిక్, కేశవరావు, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే పలు ప్రైవేటు పాఠశాలల్లో క్రిస్మస్ వేడుకలను నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు.



క్రిస్మస్ కేక్‌ను కట్‌చేస్తున్న నాగేశ్వరరావు

ఆక్రమణల జోరు.. పట్టించుకోరు



టెక్కలి పాత హైవే పక్కన అక్రమంగా ఏర్పాటు చేసిన దుకాణాలు

టెక్కలి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): టెక్కలి పట్టణంలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేస్తున్నా సంబంధిత అధికారులు స్పందించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానికనేతల పలుకుబడి, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆక్రమణదారులకు అడ్డాగా మారిపోయింది. ఆర్టీసీ గ్యారేజీకి ఎదురుగా ఉన్న కాలువను కొందరు ఆక్రమిస్తున్నారు. ఈ స్థలంలో అక్రమ నిర్మాణం చేపట్టినా రెవెన్యూ, పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇటీవల మంత్రి అచ్చెన్నాయుడు అధికారుల సమీక్షలో ఎటువంటి ఆక్రమణలను చేసినా తక్షణం స్పందించి చర్యలు చేప ట్టాలని ఆదేశాలిచ్చినా అధికారుల నిర్లక్ష్యం కారణంగా యథేచ్ఛగా ఆక్రమణలు సాగుతున్నాయనంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ స్థలంలో పక్కాగా రేకులషెడ్ నిర్మాణం, కాంక్రీట్, పెయింటింగ్ పనులు చకచకా జరిగిపోతున్నాయి. నడిరోడ్డుపై ఈ స్థాయిలో నిర్మాణాలు జరుగుతున్నా రెవెన్యూ అధికారులు ఎందుకు మౌనముద్ర వేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలాగే ఈ ప్రాంతంలో అనేక స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయని పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది. స్థానిక టీడీపీ నేతల భరోసా తోనే ఇలా జరుగుతున్నాయన్న విమర్శలొస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాల్లో ని ఆక్రమణలను తొలగించి స్థలాలను పరిరక్షించాలని పలువురు పట్టణ వాసులు కోరుతున్నారు.

కాలనీకి రోడ్డు లేక అవస్థలు



వజ్రపుకొత్తూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు సమీపంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్న కాలనీకి సరైన రోడ్డు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కాలనీలో 53 మందికి స్థలాలివ్వగా కొందరు ఇళ్ల నిర్మాణాలు చేపట్టినా కనీస సదుపాయాలను కల్పించలేదని వాపోయారు. ప్రధానం గా సీసీ రోడ్లు లేకపోవడంతో ఏమాత్రం వర్షం పడినా బురద మయంగా తయారై రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా మన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పదించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఎన్టీఆర్ కాలనీకి రోడ్డు నిర్మించండి



నిరసన తెలుపుతున్న మహిళలు

టెక్కలి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): టెక్కలి మేజర్‌పంచాయతీ పాత జాతీయ రహదారి నుంచి రెండు నుంచి ఆరులైన్ల వరకు వెళ్లాలంటే కనీసం రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నామని పలువురు స్థానికులు వాపోయారు. ఈ మేరకు మంగళవారం వారు నిరసన తెలిపారు. రహదారి లేదని పలుమార్లు అధికారులకు వినతిపత్రం ఇచ్చినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఏమాత్రం వర్షం పడినా రాకపోకలకు ఇక్కట్లకు గురవుతున్నామని, తక్షణం తగుచర్యలు తీసుకుని సీసీ రోడ్డునిర్మాణం చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

వెంకటాచలానికి మంత్రి ప్రశంస

నందిగాం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): నందిగాం మండల వినియోగదారుల సంఘ అధ్యక్షుడు లఖినాన వెంకటాచలానికి కంజ్యూమర్ యాక్టివిటీ అవార్డు లభించింది. ఈ మేరకు మంగళవారం విజయవాడ తుమ్మల పల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన జాతీయ వినియోగదారుల కార్యక్రమంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, కమిషనర్ జి.వీరపాండ్యన్ ఈ అవార్డును అందించారు. ఈ సందర్భంగా వెంకటాచలానికి జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బగాది రామ్మోహనరావు, బమ్మిడి నరేంద్రకుమార్, జిల్లా పౌరసరఫరాల అధికారి జి.సూర్యప్రకాశరావు తదితరులు అభినందనలు తెలిపారు.



వెంకటాచలానికి అవార్డు అందిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

న్యూస్ బాక్స్

పోస్టాఫీసు పనివేళల్లో మార్పు

నరసన్నపేట, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పోస్టల్ కార్యాలయాల్లో పనివేళలు మార్పు చేస్తూ ఆశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. ఈమేరకు నరసన్నపేట ఎస్పీవో రామారావు ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటి వరకు ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయం త్రం 5 గంటలకు పనిచేస్తున్న పోస్టల్ కార్యాలయాలు ఈనెల 26 నుంచి ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పనిచేస్తాయని, ఖాతాదారులు గమనించాలని సూచించారు.

డీలర్‌పై 6ఏ కేసు నమోదు

వజ్రపుకొత్తూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వజ్రపుకొత్తూరు రేషన్ డిపో డీలర్-2పై 6ఏ కేసు నమోదు చేసినట్లు డీటీ మురళీకృష్ణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం డిపోను తనిఖీ చేయగా 845 కిలోల బియ్యం, 34 పంచదార ప్యాకెట్లు లోటు ఉన్నట్లు గుర్తించా మన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదించి నట్లు చెప్పారు.

అనాథ మృతదేహానికి దహన సంస్కారాలు

నరసన్నపేట, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): జమ్ము జంక్షన్ వద్ద కొన్ని రోజులుగా ఉంటున్న 80 ఏళ్ల వృద్ధుడు చలికి మంగళవారం రాత్రి మృతి చెందారు. దీంతో స్థానికులు పంచాయతీ, పోలీసులకు సమాచారమిచ్చారు. ఏఎస్‌ఐ అసిరినాయుడు మృతదేహాన్ని పరిశీలించి పంచాయతీ సిబ్బంది సహకారంతో దహన సంస్కారాలు చేపట్టారు. చనిపోయిన వృద్ధుడు పొందూరు, ఆమదాలవలస మండలాలకు చెందిన వ్యక్తి అయి ఉంటాడని స్థానికులు చెబుతున్నారు.

జిల్లా విజిలెన్స్ మానటరింగ్ కమిటీ సభ్యుల నియామకం

రమణమూర్తి, వాబ యోగి

టెక్కలి/జలుమూరు (సారవకోట), డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యులుగా టెక్కలి మండలం పాతనౌపడాకి చెందిన గేదెల రమణమూర్తి, ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి నియమితులయ్యారు. ఈ మేరకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి హకరించిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడులకు రమణమూర్తి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తన నియామకం చేపట్టిన కలెక్టర్‌కు వాబ యోగి కృతజ్ఞతలు చెప్పారు. ఎస్టీల సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

అన్న క్యాంటీన్‌కు 100 రోజులు

కోటబొమ్మాళి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆధ్వర్యంలో కోటబొమ్మాళిలో పునఃప్రారంభించిన అన్న క్యాంటీన్ మంగళవారానికి 100 రోజులు పూర్తిచేసుకుంది. ప్రతిరోజూ 400 నుంచి 500 మంది వరకు వచ్చి భోజనం చేస్తున్నారని నిర్వాహకుడు లాడి శ్రీనివాస్ తెలిపారు. అన్నక్యాంటీన్‌కు సహాయసహ కారాలు అందిస్తున్న ప్రతి ఒక్కరికి మంత్రి కృత జ్ఞతలు తెలిపారు. భవిష్యత్‌లోనూ సహకరించాలని కోరారు.

29న ఊడికలపాడులో సత్సంగం

కోటబొమ్మాళి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఊడికలపాడు శ్రీరామమందిరంలో ఈనెల 29న ఉదయం 10 గంటల నుంచి సత్సంగం నిర్వహిస్తున్నట్లు శ్రీరామకృష్ణ రమణాకరుణ గీతాశ్రమం నిర్వాహకుడు సనపల కరుణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సత్సంగంలో పార్వతీపురం గీతాప్రచారకులు కంజుమూజు రామమోహన రావు, టెక్కలికి చెందిన నర్సింహస్వామి, వీహెచ్‌పీ, శ్రీకాకుళం ప్రతినిధి యోగా చంద్రశేఖర్ పాల్గొని వివిధ అంశాలపై ప్రసంగిస్తారని, భక్తులు పాల్గొనాలని కోరారు.

పోరుబాటను విజయవంతం చేయండి

నరసన్నపేట, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా ఈనెల 27న నిర్వహిం చనున్న పోరుబాటను విజయవంతం చేయాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ కోరారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. నియోజవర్గ కేంద్రాల్లో ఈనెల 27న నిరసన కార్య క్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

● టెక్కలి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ ఈనెల 27న విద్యుత్‌శాఖ కార్యా లయం ఎదుట నిరసన తెలపనున్నామని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేడాడ తిలక్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం పార్టీ కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

అంచనా బడ్జెట్ ఆమోదం

నందిగాం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): నందిగాం మండల వార్షిక 2025-26 అంచనా బడ్జెట్‌ను ఏకగ్రీవంగా ఆమోదించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి అధ్యక్షతన బడ్జెట్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీవో టి.రాజారావు, ఉపాధ్యక్షురాలు ఆర్.లక్ష్మీకాంతం తదితరులు పాల్గొన్నారు.